# ‘ఏకాభిప్రాయం’ మాటతోనే కాంగ్రెస్ వైఖరి తేలింది

- తెలంగాణలో ఆత్మహత్యలకు ఆ పార్టీయే కారణం
- కేసీఆర్, కోదండరాం కళ్లు తెరవాలి
- పాలమూరులో కేసీఆర్‌కు దిక్కైంది తెదేపానే
- తెలుగుదేశం నేతలు నాగం, ఎర్రబెల్లి వ్యాఖ్యలు



**విలేఖరులతో మాట్లాడుతున్న నాగం. చిత్రంలో తెదేపా నేతలు వేణుగోపాలాచారి, ఎర్రబెల్లి దయాకర్, పోచారం శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** కేంద్రం ఒక పక్క శ్రీకృష్ణ కమిటీ వేసి, మరోపక్క ప్రధాని మన్మోహన్‌సింగ్ ఏకాభిప్రాయం అనడంతోనే ఆ పార్టీ వైఖరేంటనేది స్పష్టంగా తేలిపోయిందని తెలుగుదేశం పార్టీ పేర్కొంది. అయితే లక్ష్యంగా చేసుకోవాల్సిన కాంగ్రెస్‌ను కేసీఆర్, కోదండరాంలు వదిలేసి, తెదేపాను లక్ష్యంగా చేసుకోవడం గర్హనీయమని తెలిపింది. ఐకాస కన్వీనర్ కోదండరాం తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని దుయ్యబట్టింది. ఐకాస తీసుకున్న నిర్ణయాలు చెప్పేందుకే కోదండరాం ఉన్నారంటూ, చంద్రబాబును విమర్శించేందుకు ఆయన ఎవరని ప్రశ్నించింది. ‘తెలుగుదేశం.. దిక్కుమాలిన పార్టీ’ అని కేసీఆర్ విమర్శించడాన్ని ఖండించింది. గత ఎన్నికల్లో ఆయన కరీంనగర్ నుంచి పాలమూరు రావడానికి దిక్కు చూపింది తెదేపానేనని.. అక్కడ ఆయనకు దిక్కూ, దివాణం అంతా తెదేపానేనని గుర్తు చేశారు. తెదేపా తెలంగాణ ప్రాంత సీనియర్ నేతలు నాగం జనార్దన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పోచారం శ్రీనివాసరెడ్డి, వేణుగోపాలాచారి మంగళవారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. నాగం మాట్లాడుతూ.. తెలంగాణలో జరుగుతున్న ఆత్మహత్యలకు కాంగ్రెస్ పార్టీయే కారణమని ఆరోపించారు. విద్యార్థులెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని పదే పదే విజ్ఞప్తి చేస్తున్నామని, అయినా ఉస్మానియాలో సాయికుమార్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని అన్నారు. ఆంధ్రా ప్రాంత ఉత్పత్తులను బహిష్కరిస్తున్నామని కోదండరామ్ ప్రకటించడాన్ని ఆక్షేపించారు. ఇది ఎవరు తీసుకున్న నిర్ణయమని ప్రకటించారని ప్రశ్నించారు. ఐకాస సమావేశం నిర్వహిస్తే వీటన్నింటిపైనా కోదండరాంను నిలదీస్తామని స్పష్టం చేశారు. రాజీనామాలు చేయడానికి ముందుకు రాని కాంగ్రెస్‌ను నిలదీయాల్సిన కోదండరాం.. అందుకు సిద్ధంగా ఉన్న తమపై గురి పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. తమ పార్టీ శాసనమండలి నేత దాడి వీరభద్రరావు స్థాయిని మించి మాట్లాడుతున్నారని, ఏదైనా ఉంటే ఆయన పార్టీలో చెప్పుకోవాలని ఒక ప్రశ్నకు సమాధానంగా బదులిచ్చారు. పార్టీ అధినేత చంద్రబాబు పాల్గొన్న మహాధర్నాపై న్యాయవాదులు దాడి చేసినా.. కడియం శ్రీహరి వారికి క్షమాపణలు చెప్పడం సరైన సమాచారం లేకపోవడం, వ్యక్తిగతమేనని పేర్కొన్నారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. “కేసీఆర్, కోదండరాంలకు ఒకటే చెప్తున్నా. ప్రధాని స్పష్టంగా ఏకాభిప్రాయం అన్నారు. అదెలా సాధ్యమవుతుంది? ఇకనైనా వీరిద్దరూ కళ్లు తెరవాలి”అని హితవు పలికారు. బాబ్లీ మీద అక్రమ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా చంద్రబాబు ఢిల్లీస్థాయిలో పోరాడినప్పుడు.. కేసీఆర్, కోదండరాంలు ఎక్కడున్నారని ప్రశ్నించారు. బీడీ కట్టపై పుర్రె గుర్తు ముద్రణకు కేంద్ర కార్మికశాఖ మంత్రి హోదాలో కేసీఆర్ అంగీకరిస్తే.. తెలుగుదేశం కార్మికుల తరఫున పోరాడిందన్నారు. తెదేపా కార్యకర్తల కోసం బెయిల్ పిటిషన్‌ను కోర్టులో వేయనీయకుండా అడ్డుకోవడం సరికాదని అన్నారు. కార్యకర్తలకు ఎలా బెయిల్ తెచ్చుకోవాలో తాము చూసుకుంటామని చెప్పారు.

## కాంగ్రెస్‌ను అడగరేం? : తలసాని

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** తెలంగాణ ఇచ్చేది, తెచ్చేది తామే అంటున్న కాంగ్రెస్‌పై ఐకాస, కేసీఆర్‌లు ఎందుకు విమర్శించడం లేదని తెదేపా సీనియర్ నేత తలసాని శ్రీనివాసయాదవ్ ప్రశ్నించారు. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించిన కేసీఆర్.. తన ఎంపీ పదవికి రాజీనామా చేయలేదేమని విమర్శించారు. “మా అధినేత చంద్రబాబు పార్లమెంటుకు అడ్డంగా పడుకుంటే తెలంగాణ వస్తుందా? పడుకోకుంటే రాదా? . ఇవ్వాల్సింది కాంగ్రెస్ ప్రభుత్వం” అని మంగళవారమిక్కడ అసెంబ్లీ లాబీల్లో తలసాని పేర్కొన్నారు. తెలంగాణ అంశంపై ఆయన పార్లమెంటులో అడగక పోవడాన్ని వ్యూహం అంటారని ఎద్దేవా చేశారు.